సాక్షి
కృష్ణాజిల్లా

ఆదివారం । 9 । జూలై । 2023



పోలీసులకు రెయిన్ కోట్లు పంపిణీ

పటమట: ట్రాఫిక్ పోలీసులకు శనివారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ట్రాఫిక్ ఏడీసీపీ దేవర కొండ ప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ సురేష్‌కుమార్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ రామారావు పాల్గొన్నారు.



మూగజీవాలకు మెరుగైన వైద్యం

అవనిగడ్డ పశువైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ఎమ్మెల్యే సింహాద్రి శనివారం ప్రారంభించారు. -8లో



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ దర్శనానికి శనివారం భక్తులు తరలివచ్చారు. వరస సెలవులు, ఆషాఢ మాసోత్సవాల నేపథ్యంలో రికార్డు స్థాయిలో అమ్మవారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

కార్తికేయుని సేవలో ఎంపీ మోపిదేవి



మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శనివారం ఉదయం దేవస్థానానికి చేరుకున్న మోపిదేవికి ఆలయ ఏసీ ఎన్.ఎస్. చక్రధరరావు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. స్వామి వారికి ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ, సతీష్ శర్మ అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం స్వామి వారి శాంతి కల్యాణంలో పాల్గొన్న మోపిదేవి కుటుంబ సభ్యులు నిత్యాన్నదానం కోసం రూ.50 వేల విరాళాన్ని ఏసీ చక్రధరరావుకు అందజేశారు. ఆలయ ఏసీ స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలను మోపిదేవికి అందజేసి, శాలువాతో సత్కరించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆలయ ప్రాంగణంలో ఎంపీ మోపిదేవి కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిశారు.

13న శ్రీహరికోటకు సూపర్ లగ్జరీ బస్సు

గన్నవరం: తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం నుంచి ప్రయోగించనున్న చంద్రయాన్-3ను ప్రత్యేక్షంగా తిలకించేందుకు గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 13వ తేదీన సూపర్ లగ్జరీ బస్సు నడుపుతామని డీఎం పి.శివాజీ శనివారం తెలిపారు. ఈ బస్సు 13వ తేదీ రాత్రి 10 గంటలకు గన్నవరంలో బయలుదేరి 14వ తేదీ ఉదయం నేలపట్టు పక్షుల సందర్శన కేంద్రం, పులికాట్ సరస్సు సందర్శించుకుని మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీహరి కోటకు చేరుకుంటుందన్నారు. ఆ రోజు చంద్రయాన్ ప్రయోగం తర్వాత అక్కడి నుంచి బస్సు బయలుదేరి 15వ తేదీ ఉదయం ఐదు గంటలకు గన్నవరం చేరు కుంటుందని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ బస్సును సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఈ బస్సు టిక్కెట్ ధర రూ.1,600గా నిర్ణయించినట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 87909 96090, 73829 05633 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మనసున్న మారాజుకు నీరాజనం



పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు



కానూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, తాతినేని పద్మావతి తదితరులు



తోట్లవల్లూరులో వైఎస్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, నాయకులు



గుడివాడలో కేక్ కట్‌చేస్తున్న మంత్రి విడదల రజిని. చిత్రంలో ఎమ్మెల్యే కొడాలి నాని తదితరులు

మనసున్న మారాజు వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని కృష్ణా జిల్లా ప్రజలు సంబరంగా జరుపుకొన్నారు. జోహార్ రాజన్న అంటూ జనవాణి నినదించింది. సంక్షేమ స్ఫూర్తి ప్రదాతకు ఘన నివాళులర్పించింది.

- వాడవాడలా ఘనంగా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు
- పెడన నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ
- వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పించిన మంత్రి జోగి రమేష్
- పలు చోట్ల భారీగా సేవా కార్యక్రమాల నిర్వహణ

చిలకలపూడి(మచిలీపట్నం): మనసున్న మారాజు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి జిల్లా ప్రజలు నీరాజనం పలికారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినదించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని వాడవాడలా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రైతుల పక్షపాతిగా, పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి వైఎస్ రాజశేఖరరెడ్డి అని పలువురు నాయకులు కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 సేవలు తదితర పథకాలతో ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నిండాయని గుర్తుచేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

- పెడన నియోజకవర్గంలో మంత్రి జోగి రమేష్ గూడూరు ప్రధాన సెంటరులో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. అనంతరం పెడన పార్టీ కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అక్కడి నుంచి బైక్‌ర్యాలీగా పట్టణంలోని పెట్రోల్ బంక్ వద్ద ఉన్న భారీ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తోటమూల సెంటరులో వైఎస్సార్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెడన పీఏసీఎస్ వద్ద పేదలకు చీరలు పంపిణీ చేశారు.
- గుడివాడ పట్టణంలో ప్రభుత్వాస్పత్రి ప్రారంభోత్సవం అనంతరం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవేంకటేశ్వరరావు (నాని) వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- పెనమలూరు నియోజకవర్గం, తాడిగడపలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథితో కలిసి ఎంపీ బాలశౌరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కంకిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎమ్మెల్యే పార్థసారథి దుప్పట్లు పంపిణీ చేశారు. ఉయ్యూరు ప్రధాన సెంటరులోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఆర్టీసీ రీజియన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి తదితరులు పాల్గొన్నారు.
- అవనిగడ్డలోని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం, వంతెన సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.
- పామర్రు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంతో పాటు ప్రధాన సెంటరులో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. తోట్లవల్లూరు, పమిడిముక్కల, పెదపారుపూడి, మొవ్వ మండలాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని పాల్గొన్నారు.
- మచిలీపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కోర్టు సెంటరులోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత పాల్గొన్నారు.

ఏసీఏ సెంట్రల్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) సెంట్రల్ జోన్ రెండో విడత మల్టీడే (మూడురోజుల) సీనియర్ పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు శనివారం ప్రారంభమయ్యాయి. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని ఏసీఏ (డీవీఆర్,సీపీ) మైదానాల్లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లకు ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. డీవీఆర్ మైదానంలో కృష్ణా, గుంటూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గుంటూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని తొలి ఇన్నింగ్స్‌లో 63.3 ఓవర్లకు 202 పరుగులు చేసి ఆలౌటైంది. మణిదీప్ 78, మనోహర్ 47, వంశీ 38 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు సందీప్ ఏడు, లలిత్‌మోహన్ రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 20 ఓవర్లకు రెండు వికెట్లు కోల్పోయి 80 రన్స్ చేసింది. బ్యాట్స్‌మెన్‌లు దుర్గారావు 25 రన్స్ చేయగా చంటి 20(నాటౌట్), అఖిల్ 7 (నాటౌట్) చేశారు. సీపీ మైదానంలో ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పశ్చిమగోదావరి జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 60 ఓవర్లకు 205 పరుగులు చేసి ఆలౌటైంది. బ్యాట్స్‌మెన్‌లు జాన్‌రిచార్డ్ 85, స్వామినాయుడు 40 రన్స్‌తో రాణించగా, ప్రకాశం జట్టు బౌలర్లు నవీన్ ఆరు, శివ మూడు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 29 ఓవర్లకు నాలుగు వికెట్లు నష్టపోయి 77 రన్స్ చేసింది. బ్యాట్స్‌మెన్‌లు కిరణ్ 39 (నాటౌట్), రోహిత్ 11(నాటౌట్) రన్స్ చేయగా పశ్చిమగోదావరి జట్టు బౌలర్ రాజు మూడు వికెట్లు తీశారు.

ఆప్కాస్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గం

గన్నవరం: ఆప్కాస్ (ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్స్‌డ్ సర్వీసెస్) ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జి.చిన్నబాబు (తిరుపతి జిల్లా), ప్రధాన కార్య దర్శిగా ఎస్.నూర్‌మహమ్మద్ ఎన్నికయ్యారు. స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో శనివారం జరిగిన ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ విస్తృత స్థాయి సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి. పవన్‌కుమార్ (ఎన్టీఆర్ జిల్లా), కోశాధికారిగా ఆర్. రజని (హెచ్‌ఓడీ) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పి. వెంకటసుబ్బయ్య (వైఎస్సార్), వి.సంజీవ్ (గుంటూరు), ఎస్.ఆదినారాయణ (ప్రకాశం), రవి (కర్నూలు), లక్ష్మణరావు (బాపట్ల), శ్రీనివాసరావు (ఎన్టీఆర్), కుమార్ (తిరుపతి), సత్యనారాయణ (ఏపీ సచివాలయం), శ్రీధర్ (తూర్పు గోదావరి)ను ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శులుగా ఎస్.భాగ్యలక్ష్మి (గుంటూరు, హెచ్‌ఓడీ), బి.హెచ్.వి.ఎస్.ఎన్.రాజు (హెచ్‌ఓడీ), ఎం.శేషుబాబు (కృష్ణా), టి.రామకృష్ణ (అనకాపల్లి), ఎం.రవిప్రకాష్ (కడప), రమేష్‌బాబు (గుంటూరు), బి.మునిరాజా (తిరుపతి), మరో 35 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఏసీ చైర్మన్ ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆప్కాస్ ఉద్యోగుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర నాయకుడు ఇ.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచే నూతన విద్యావిధానం



మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

గుడివాడ టౌన్: నూతనంగా ప్రవేశ పెడుతున్న విద్యావిధానంతో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించొచ్చని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) శిక్షణ తరగతులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ప్రకాష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థమయ్యేలా నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ఐఎఫ్‌పీ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ విధానాన్ని ప్రతి ఉపాధ్యాయుడు పూర్తిగా తెలుసుకోవాలని స్పష్టంచేశారు. ఇది బోధనను సులువు చేస్తుందన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యేలా ప్రోగ్రామ్ తయారైందని, దాని ఆపరేషన్ విధానాన్ని ఉపాధ్యాయులు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించారు, తదుపరి గుడివాడ రూరల్ మండలంలోని మోటూరు గురుకుల పాఠశాలను సందర్శించారు. డీఈఓ తాహెరా సుల్తానా, డీవైఈఓ సుబ్బారావు, ఎంఈఓ శేఖర్‌సింగ్, ఎంఈఓ-2 బాలాజీ పాల్గొన్నారు.

పంటల బీమాతో రైతులకు ఆపన్నహస్తం

- రైతు దినోత్సవ సభలో మంత్రి జోగి రమేష్
- డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం లబ్ధిదారులకు అందజేత
- 231 మంది రైతులకు రూ.57.44 లక్షల మేర లబ్ధి



రైతులకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా చెక్కు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి, కలెక్టర్ రాజాబాబు తదితరులు

పెడన: రైతును రాజును చేసిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కొనియాడారు. వైఎస్సార్ రైతులకు చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతి రోజును రైతు దినోత్సవంగా జరుపుకొంటున్నామని పేర్కొన్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖరీఫ్-2022లో పంట నష్టపరిహారం కింద డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో శనివారం ప్రారంభించారు. పెడన వ్యవసాయ మార్కెట్ యార్డులో మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు బీమా చెక్కును రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలుచేశారని కొనియాడారు. ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతును రారాజుగా చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారని వివరించారు. దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతులకే నేరుగా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను అందజేస్తున్నారని తెలిపారు. రైతులకు మంచి పనులు చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి రైతూ అండగా నిలవాలని కోరారు.

కృష్ణాడెల్టాను సస్యశ్యామలం చేసిన వైఎస్సార్

మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖరరెడ్డి నిరుపేదల గుండెల్లో గూడు కట్టుకున్నారంటే ఆయన పరిపాలనను ఏ విధంగా మెచ్చుకుంటున్నారో అర్థమవుతోందన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు, పేదలకు ఆరోగ్యశ్రీ, విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంటు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీ మధ్య పులిచింతల ప్రాజెక్టును నిర్మించి 45 టీఎంసీల నీటిని నిల్వ చేసి కృష్ణాడెల్టాను సస్యశ్యామలం చేసిన ఘనత రాజశేఖరరెడ్డిదేనని గుర్తుచేశారు. తండ్రికి తగ్గ తనయుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నారని వివరించారు. గతంలో పంట రుణం పొందాలంటే ప్రీమియం రూపంలో ఎకరానికి రూ.800 నుంచి రూ.1000 వరకు చెల్లించాల్సి వచ్చేదని, బీమా చేసినా పరిహారం వస్తుందా రాదా అనే విషయంలో కూడా స్పష్టత ఉండేది కాదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల ఇంటికి వెళ్లి బీమా చేస్తున్నారని, పరిహారం నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతోందని వివరించారు.

రైతు భరోసా కేంద్రాలతో మేలు

కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ.. రైతులకు సేవలందిస్తున్న రైతు భరోసా కేంద్రాలు దేవాలయాలు వంటివన్నారు. వైఎస్సార్ రైతు దినోత్సవం రోజున రైతులకు ఉచిత పంటల బీమాను విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. 2022 ఏడాదిలో కృత్తివెన్ను మండలం నీలుపూడి గ్రామానికి చెందిన 231 మంది రైతులకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా నష్ట పరిహారం కింద రూ.57.44లక్షలు విడదలయ్యాయని వివరించారు. ఈపథకం కింద 2019 నుంచి 2021 వరకు జిల్లాలో 66,572 మంది రైతులకు రూ.120.92 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. మునిసిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ఎండీ ఖాజా, జిల్లా వ్యవసాయశాఖాధికారి పద్మావతి, వ్యవసాయశాఖ మండలి చైర్మన్ జన్ను రాఘవరావు, వ్యవసాయ శాఖ ఉపసంచాలకుడు మనోహరరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు, బంటుమిల్లి ఎంపీపీ చినబాబు, కృత్తివెన్ను జెడ్పీటీసీ సభ్యులు రత్నకుమారి, వ్యవసాయశాఖ అనుబంధ శాఖల అధికారి గిరిజారాణి తదితరులు పాల్గొన్నారు. తొలుత వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు.

డెప్యూటీ మేయర్ల పేర్లు ఖరారు

శీలం భారతి, మాడపాటి వెంకటేశ్వరమ్మకు అవకాశం





మచిలీపట్నంటౌన్: ఈ నెల 13వ తేదీన నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ల ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో నూతన డెప్యూటీ మేయర్ల పేర్లను ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రకటించారు. మునిసిపల్ ఎన్నికల సమయంలో జరిగిన ఒప్పందం ప్రకారం రెండున్నర సంవత్సరాల పాలనను ముగించుకున్న డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత లు ఇటీవల తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో ఈ నెల 13వ తేదీన నూతన డెప్యూటీ మేయర్ల ఎన్నిక ప్రక్రియ జరగనుంది. నూతన డెప్యూటీ మేయర్లుగా 3వ డివిజన్ కార్పొరేటర్ శీలం భారతి నాగకుసుమ రాణి, 26వ డివిజన్ కార్పొరేటర్ మాడపాటి విజయలక్ష్మి పేర్లను పేర్ని నాని ఖరారు చేశారు. మొత్తం 50 మంది కార్పొరేటర్లు ఉండగా వీరిలో ఐదుగురు టీడీపీ, ఒక జనసేన సభ్యులు ఉన్నారు. మిగిలిన 44 మంది వైఎస్సార్ సీపీ కి చెందిన వారే. 13వ తేదీ జరిగే డెప్యూటీ మేయర్ల ఎన్నికలో శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి ఎన్నిక లాంఛనమే కానుంది. శీలం భారతి భర్త శీలం మారుతీరావు (బాబ్జి) రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా పనిచేశారు. అలాగే మాడపాటి విజయలక్ష్మి గతంలో కౌన్సిలర్‌గా కూడా పనిచేయగా ఆమె భర్త మాడపాటి వెంకటేశ్వరరావు రెండుసార్లు కౌన్సిలర్‌గా పనిచేశారు. సీనియర్ సభ్యులుగా ఉన్న వీరిని పేర్ని నాని డెప్యూటీ మేయర్లుగా ఎంపిక చేశారు.

నేటి నుంచి పద్య నాటకోత్సవాలు

విజయవాడ కల్చరల్: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా సాయి బాలాజీ నాట్యమండలి, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి రెండురోజుల పాటు పద్య నాటకాలు నిర్వహించనున్నారు. గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద పద్యనాటక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వైఎస్సార్ సీపీ కైకలూరు నియోజకవర్గ నాయకుడు వి.బాబేలు రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న శివలీలలు, 10న సత్యహరిశ్చంద్ర పద్య నాటకాలు ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. అలానే వైఎస్సార్ స్ఫూర్తి సభను నిర్వహిస్తామన్నారు.

బందరుకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి

ఎంపీ బాలశౌరి



సీటి స్కాన్ పరిశీలిస్తున్న ఎంపీ బాలశౌరి

మచిలీపట్నంటౌన్: ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న మచిలీపట్నంకు పూర్వ వైభవం తెచ్చే దిశగా కృషి చేస్తున్నట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. నగరంలోని జిల్లా సర్వజన ఆసుపత్రిలో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ సంస్థ (ఆర్ఈసీ) నిధులు రూ. 35 లక్షలతో బ్లడ్ బ్యాంక్‌లో అవసరమైన పరికరాలు ఏర్పాటు చేసిన విభాగాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ కృష్ణా జిల్లా ఎంతో పురాతన చరిత్ర కలిగిన జిల్లా అని తెలిపారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ల జాబితా చూస్తే బ్రిటీష్ వారు కూడా పనిచేసిన చరిత్ర ఉందన్నారు. ఇలాంటి ఘన చరిత్ర ఉన్న మచిలీపట్నంకు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా తన శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. పలు సంస్థల నుంచి వారి లాభాల్లో ప్రజావసరాలకు ఖర్చు పెట్టే నిధులను పెద్ద మొత్తంలో బందరు పార్లమెంట్ నియోజకవర్గానికి తీసుకురావటంలో తాను సఫలీకృతమయ్యానని చెప్పారు. అందువల్లే రాష్ట్రంలోని ఇతర ఎంపీల కన్నా తానే ఎక్కువ మొత్తం నిధులను రాబట్టి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. బందరు పోర్టు నిర్మాణానికి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ. 4 వేల కోట్లు రుణాన్ని తీసుకురావటం జరిగిందన్నారు. కోవిడ్ సమయంలో జిల్లా ఆసుపత్రికి సీటి స్కాన్ అవసరమని కోరటంతో సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి రూ. 1.75 కోట్లతో ఏర్పాటు చేశామని వెల్లడించారు. అలాగే రక్తాన్ని నిల్వ చేసేందుకు పరికరాలు అవసరమని కోరటంతో వీటిని కూడా సీఎస్ఆర్ నిధుల నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని పలు ఆసుపత్రుల్లో పరికరాల ఏర్పాటుకు రూ. 5 కోట్లను సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి సేకరించామని చెప్పారు. ఈ నిధులతో ఆసుపత్రుల్లో అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ జీఎస్ రమేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయకుమారి, వైస్ ప్రిన్సిపాల్ బి. ఆశాలత, డెప్యూటీ సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, ఆర్ఈసీ చీఫ్ ప్రోగ్రాం మేనేజర్ ఎస్.జయంతి, ఆసుపత్రి పూర్వ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ అల్లాడ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరిని ఆసుపత్రి వైద్యులు, బ్లడ్ బ్యాంక్ వైద్యులు ఘనంగా సత్కరించారు.

మూగజీవాలకు మెరుగైన వైద్యం

అవనిగడ్డలో వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సింహాద్రి



అవనిగడ్డలో పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: పశువులకు మెరుగైన ఆధునిక వైద్యసేవలు అందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక పశువైద్యశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ఎమ్మెల్యే సింహాద్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 154 పశువ్యాధి ప్రయోగశాలను ఏర్పాటు చేయాలని సీఎం జగన్ సంకల్పించగా, 70 ప్రయోగశాలలను ఇప్పటికే సిద్ధం చేసినట్లు చెప్పారు. వీటిద్వారా పశువులకు 215 రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి రావడంతో పశువులకు సత్వర వైద్యసేవలు అందుతాయని తెలిపారు. దీని వల్ల పశుమరణాలను తగ్గించడంతో పాటు పశుసంపదను వృద్ధి చేయవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంపదను వృద్ధి చేసేందుకు, పశుపోషకులకు ప్రయోజనం కలిగించేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. మనుషులతో పాటు పశువులకు ఆధునిక వైద్యసేవలు అందించేలా సీఎం పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. పశువృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పశు పోషకులకు అవగాహన కల్పించి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు పశువైద్యులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, మినరల్స్ ప్యాకెట్లను ఎమ్మెల్యే సింహాద్రి రైతులకు అందజేశారు.

పాత భవనం పడగొట్టేందుకు చర్యలు...

ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఏడీ బి.సాంబశివరావు మాట్లాడుతూ పాత పశు వైద్యశాల భవనం శిథిలమడం వల్ల పడగొడితే పశువైద్య సేవలకు ఉపయోగ పడుతుందని శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సింహాద్రి ఆర్అండ్‌బీ డీఈ వరలక్ష్మీని పిలిపించి భవనాన్ని పడగొట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దీనికి సంబంధించి ఆ శాఖ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే సింహాద్రి ఫోన్‌లో మాట్లాడారు. పశుసంవర్ధకశాఖ డీడీ రమణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఏడీ బి సాంబశివరావుతో పాటు అవనిగడ్డ, చల్లపల్లి, కోడూరు, నాగాయలంక మండలాలకు చెందిన పశువైద్యులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం

- ఎస్పీ జాషువా ఆదేశాలతో విస్తృతంగా దాడులు
- పలువురి అరెస్టు
- భారీగా గంజాయి స్వాధీనం



గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మాధవరెడ్డి

కోనేరుసెంటర్: బందరు సబ్ డివిజన్ పరిధిలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న నిందితులను బందరు సబ్ డివిజన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పెద్ద మొత్తంలో సరుకు స్వాధీనం చేసుకున్నారు. బందరు డీఎస్పీ మాధవ రెడ్డి తన కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మచిలీపట్నం ఈడేపల్లికి చెందిన తంగెళ్ళ నవీన్‌కుమార్, ఉల్లిపాలెంకు చెందిన యక్కల నాగసురేష్, అరుణోదయకాలనీకి చెందిన అబ్దుల్‌సలీం, అబ్దుల్ మెహర్జా, పెడనకు చెందిన అబ్దుల్‌సైదా, దాసరి ప్రవీణ్‌కుమార్, కృత్తివెన్ను మండలం కొమళ్ళపూడి గ్రామానికి చెందిన వలవ సుధీన్‌కుమార్, చిటుకుల సత్యనారాయణలు డబ్బును సులువైన మార్గంలో సంపాదించాలనే దురుద్దేశంతో గంజాయి అమ్మకాలకు తెరలేపారు. ఆర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తూ తంగెళ్ళ నవీన్‌కుమార్, యక్కల నాగసురేష్‌లు పట్టుబడగా వారి నుంచి 2.6 కేజీలు, మచిలీపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన అబ్దుల్‌సలీం, అబ్దుల్‌మెహర్జాల నుంచి 1.5 కేజీలు , పెడన పోలీస్‌స్టేషన్ పరిధిలో అబ్దుల్ సదా, దాసరి ప్రవీణ్‌కుమార్, వలవ సుధీర్‌కుమార్, చిటుకుల సత్యనారాయణల నుంచి 2.4 కేజీలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారందరి నుంచి 6.5 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులను కోర్టుకు హాజరుపరచటం జరిగిందన్నారు. సీఐ వీరయ్యగౌడ్, ఆర్‌పేట సీఐ రవికుమార్, ఆర్‌పేట, మచిలీపట్నం, పెడన ఎస్సైలు వాసు, పెడన వెంకటేశ్వరరావు, రవిచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో ఐదుగురు..

అవనిగడ్డ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు ఇన్‌చార్జి డీఎస్పీ వై.మాధవ రెడ్డి చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి నాజర్‌పేటకు చెందిన చిత్తూరు ప్రవీణ్, బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన డొక్కు పోతురాజుని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 1.6 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. వీరిచ్చిన సమాచారం మేరకు చల్లపల్లికి చెందిన చిలక అజయ్, కనుమూరి పవన్‌బాబు వక్కలగడ్డకు చెందిన కొల్లూరి సాగర్‌ని అదుపులోకి తీసుకుని విచారించగా 1.2 కిలోల గంజాయిని పట్టుకున్నామని వెల్లడించారు. ఒడిస్సా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ విద్యార్థులు, యువకులకు విక్రయిస్తున్నట్టు వివరించారు. సీఐ జి శ్రీనివాస్, అవనిగడ్డ, చల్లపల్లి ఎస్ఐలు రమేష్, చిన్నబాబు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

మొవ్వ: కృష్ణా జిల్లా ఎస్పీ పీ జాషువా (ఐపీఎస్) ఆదేశాల మేరకు సీఐ ఎన్. వెంకటనారాయణ ఆధ్వర్యంలో కూచిపూడి ఎస్ఐ డి.సందీప్ తమ సిబ్బందితో స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కూచిపూడి ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మొవ్వ మండల పరిధిలో గల మొవ్వ గ్రామానికి చెందిన పర్లపల్లి లోకేష్, అయ్యంకి గ్రామానికి చెందిన సూర్గం భాను ప్రకాష్‌లు మొవ్వ-కూచిపూడి రోడ్డులో కుడివైపు ఖాళీగా ఉన్న ప్లాట్లలో పట్టుకున్నామని తెలిపారు. వీరి వద్ద నుంచి 2 కేజీల గంజాయి, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. మైలవరానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు వివరించారు. వీరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కి పంపినట్లు వెల్లడించారు.

వైద్యుడంటే దేవుడితో సమానం



అవార్డు గ్రహీతలను సత్కరించిన ఇంతియాజ్, చిత్రంలో డాక్టర్ సమరం, హజరత్తయ్యగుప్తా

సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైద్యో నారాయణో హరిః అని మన పెద్దలు చెప్పినట్లు, వైద్యుడిని దేవునితో పోలుస్తారని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ముఖ్యకార్య నిర్వహణాధికారి ఎ.ఎమ్.డి. ఇంతియాజ్ పేర్కొన్నారు. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లోని సెర్ప్ కాన్ఫరెన్స్ హాల్లో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని కవి సమ్మేళనం, వైద్యరత్న, సేవా రత్న పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు బిధాన్ చంద్రరాయ్ జయంతిని వైద్యుల దినోత్సవం జరుపుతారని తెలిపారు. ఆయనొక గొప్ప రాజకీయవేత్త, మానవతావాది అని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన ఆధ్యాత్మిక వేత్త, వాసవి క్లబ్‌ల అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్.వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ సమాజ హితంగా వృత్తి ధర్మం పాటిస్తూ ప్రజలను పీడించకుండా వైద్య సేవలు అందించిన ప్రతి ఒక్కరూ ప్రశంసనీయులేనని చెప్పారు. అటువంటి వారు నిజంగా దేవుళ్లని పేర్కొన్నారు. డాక్టర్ సమరం మాట్లాడుతూ కనిపించని దేవుడికంటే కనిపించే వైద్యుడ్ని దేవుడిగా భావిస్తారని వివరించారు. అనంతరం డాక్టర్ కోడే ప్రభాదేవి, డాక్టర్ జాన్ బాబు, డాక్టర్ నీరజ్ కాంత్‌లను వైద్యరత్న అవార్డుతో, ఎల్.వి.ఎన్.ప్రసన్న కుమార్, నవరం రోజీ రంజిత, గుజ్జర్ సిద్ధార్థ లను సేవారత్న అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఫౌండర్ ఆర్.ఆర్.గాంధీ నాగరాజన్, డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీ మోహన్ రాజు, కవులు రిజీనా, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.